
పీఠం ఎవరికో?

బీజేపీ జిల్లా అధ్యక్ష పదవిపై ఉత్కంఠ

- రేసులో పలువురు సీనియర్ నాయకులు
- ముమ్మర ప్రయత్నాల్లో ఆశావహులు
- స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యం
- పార్టీ బలోపేతంపై అధిష్ఠానం దృష్టి



బీజేపీ జిల్లా అధ్యక్షుడి ఎంపికపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ సారి అధ్యక్ష పీఠాన్ని దక్కించుకునేందుకు ఆశావహులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. బీజేపీ సిద్ధాంతాల ప్రకారం పార్టీకి పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇస్తుంది. ఇప్పటికే మండల, డివిజన్, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులను నియమించుకున్న పార్టీ ఇప్పుడు జిల్లా అధ్యక్షుడి నియామకానికి సిద్ధమైంది. అసెంబ్లీ ఎన్నికల తరువాత పలువురు బీఆర్ఎస్ నేతలు బీజేపీలో చేరిన విషయం తెలిసిందే. లోక్‌సభ ఎన్నికల్లో కొత్త, పాత నాయకులు అంతా కలిసి చేవెళ్ల పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా పార్టీలోకి వచ్చిన నేతలు సైతం అధ్యక్ష పదవిపై ఆశలు పెట్టుకున్నారు. జిల్లా అధ్యక్ష పదవిని ఎవరికి కట్టబెట్టాలనే విషయంపై అధిష్ఠానం అభిప్రాయాలను సేకరిస్తోంది.

వికారాబాద్/మేడ్చల్ ప్రతినిధి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత బీజేపీ అధ్యక్షుడిగా కోకట్ మాధవరెడ్డి బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తి కావస్తుండడంతో కొత్త అధ్యక్షుడి వేటలో పార్టీ నిమగ్నమైంది. మాధవరెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో అమిత్ షా వంటి జాతీయ నాయకులు వికారాబాద్‌కు రావడం ఒక పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకోవడంతో ఆయనకు మంచి మార్కులే పడ్డాయి. కొత్తగా వచ్చే జిల్లా అధ్యక్షుడు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి మంచి ఫలితాలు తీసుకురావడంతో పాటు ప్రస్తుతం ఉన్న కొత్త పాత నాయకులను కలుపుకుని పోయే వ్యక్తులైతే బాగుంటుందని పార్టీలో చర్చ జరుగుతోంది. అయితే పార్టీ సిద్ధాంతాల

మిగతా 8వ పేజీలో...

వికారాబాద్ జిల్లా రేసులో..

ప్రధానంగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివరాజ్, కేపీ రాజు ముమ్మరంగా పోటీ పడుతున్నారు. అలాగే తాండూరుకు చెందిన రమేశ్ సైతం బరిలో ఉన్నారు. అయితే రమేశ్ గతంలో పార్టీ మారడం ఆయనకు ప్రతికూలంగా మారినట్లుగా తెలుస్తోంది. అయినా రమేశ్ సైతం రేసులో ఉన్నారని, ఆయనకు తోడు గతంలో జిల్లా అధ్యక్ష పదవి చేపట్టిన సదానందారెడ్డి సైతం మరో సారి అధ్యక్ష పదవి కోసం పోటీపడుతున్నట్లుగా తెలుస్తోంది. జిల్లా ఉపాధ్యక్షుడు పాండు సైతం పోటీలో ఉన్నారు. వీరితో పాటు కొత్తగా పార్టీలో చేరి వికారాబాద్ అసెంబ్లీ సీటును ఆశిస్తూ క్రియాశీలకంగా గ్రామస్థాయి నుంచి పనిచేస్తున్న నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్ల నందు తనకు అధ్యక్ష పదవి ఇస్తే పార్టీని ముందుకు తీసుకెళ్తామని పేర్కొంటున్నారు. ఇందులో ఎవరికి అవకాశం దక్కుతుందో వేచి చూడాల్సి ఉంది.

మేడ్చల్ జిల్లా నుంచి పోటీలో..

మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్ష పదవికి 11 మంది నేతలు దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు పి. విక్రంరెడ్డితో సహా జిల్లా నాయకులు తిరుమల్‌రెడ్డి, బబుద్ది శ్రీనివాసపటేల్, సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, శోభారెడ్డి, కూరపాటి విజయ్‌కుమార్ పోటీ పడుతున్నారు. విక్రంరెడ్డి రూరల్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగలేనని పేర్కొంటే తప్ప.. ఇతరులకు ఆ పదవి దక్కే అవకాశాలు లేవన్న చర్చ పార్టీ వర్గాల్లో కొనసాగుతోంది. అలాగే అర్బన్ జిల్లా కమిటీ అధ్యక్ష పదవికి నందనం దివాకర్, భానుప్రకాశ్, డాక్టర్ శిల్పారెడ్డి, అడ్వకేట్ ప్రసన్న, శ్రీనివాస్ ముదిరాజ్ పోటీ పడుతున్నారు.



వైద్యాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

- అంగన్‌వాడీలను విధిగా తనిఖీ చేయాలి
- వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

నవాబుపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా కృషి చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం నవాబుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేపడుతున్న పనులతో పాటు వట్టిమీనపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే, పులుమామిడిలో జరుగుతున్న భూసర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీహెచ్‌సీలో వైద్యులు అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్, ఇన్‌పేషంట్ వార్డులను ఆయన పరిశీలించారు.

వట్టిమీనపల్లిలో సర్వే పరిశీలన

అనంతరం వట్టిమీనపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే, రైతు భరోసా సర్వేను పరిశీలించారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందుతాయన్నారు. అదే విధంగా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో అంగన్‌వాడీ పూర్వ ప్రాథమిక పాఠశాలలను ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు విధిగా తనిఖీలు నిర్వహించాలన్నారు. కలెక్టర్ ఎంట డీఎంహెచ్‌వో వెంకటరమణ, తహసీల్దార్ జయరాం, ఎంపీడీవో అనురాధ, పీహెచ్‌సీ వైద్యాధికారి రోహిత్, పంచాయతీ కార్యదర్శి గీత తదితరులు ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

పకడ్బందీగా భూసర్వే నిర్వహించాలి

- అవసరమైతే సర్వేయర్ల ద్వారా వివరాలు తీసుకోండి
- మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్

కీసర, జనవరి 16(ఆంధ్రజ్యోతి): రైతు భరోసా పథకం అమలుకు సంబంధించిన భూసర్వే పకడ్బందీగా నిర్వహించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. గురువారం కీసర తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయేతర భూములను గుర్తించే క్షేత్రస్థాయి వివరాలను ఆయన అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వ్యవసాయ, ఉద్యానవన, తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీపీఆర్ మ్యాప్ ద్వారా పరిశీలిస్తూ, క్షేత్రస్థాయిలో భూమి సాగు యోగ్యమైనదా? కాదా? కచ్చితంగా గుర్తించాలని తెలిపారు. అవసరమైతే సర్వేయర్ల ద్వారా సమాచారం, లేఅవుట్ కాపీలు, నాలాగా మార్చిన భూములు, పరిశ్రమలకు సంబంధించిన భూముల వివరాలు సేకరించాలన్నారు. ప్రభుత్వ నియమ, నిబంధనల మేరకు 19వ తేదీ వరకు నివేదికను అందజేయాలన్నారు. కార్యక్రమంలో లా అధికారిణి చంద్రవతి, కీసర తహసీల్దార్ అశోక్, మండల వ్యవసాయ శాఖ అధికారిణి మాధవీలత, డిప్యూటీ తహసీల్దార్ అశ్విన్‌లతో పాటు ఆర్ఐలు, సర్వేయర్ పాల్గొన్నారు.



ఆహార భద్రత కార్డుల సర్వేలో అదనపు కలెక్టర్ రాధిక గుప్తా

ముమ్మరంగా రేషన్ కార్డుల సర్వే

అదనపు కలెక్టర్ రాధిక గుప్తా

కీసర, జనవరి16(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికి ఆహార భద్రత కార్డులు జారీ చేస్తామని మేడ్చల్ అదనపు కలెక్టర్ రాధిక గుప్తా తెలిపారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలో గురువారం ఆమె ఆహార భద్రత కార్డుల సర్వేలో పాల్గొన్నారు. ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులను జారీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. సంబంధిత అధికారులు నిర్ణీత గడువులోగా పారదర్శకంగా అర్హులను గుర్తించాలన్నారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా కుటుంబ సభ్యులు వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భాస్కర్ రెడ్డి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఉమాహారతి

సాగు చేయని భూములను గుర్తించాలి

- ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి

దౌల్తాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయేతర భూములను పక్కాగా గుర్తించాలని ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆన్‌లైన్‌లో రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను సేకరిస్తున్న ప్రక్రియను ఆమె పరిశీలించారు. అదే విధంగా రైతు భరోసా పథకానికి అర్హులైన వారి వివరాలను అధికారులు సేకరించారు. వ్యవసాయేతర, వ్యవసాయ భూములను అధికారులు పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఆమె రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గాయత్రి, డిప్యూటీ తహసీల్దార్ చాంద్ పాషా, ఆర్ఐ చంద్రశేఖర్, లావణ్య, ఏఈవోలు పాల్గొన్నారు.

పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాల దరఖాస్తుకు గడువు పెంపు

వికారాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని వివిధ ప్రైవేటు, ప్రభుత్వ కళాశాలల్లో వివిధ కోర్సులలో విద్యనభ్యసిస్తున్న అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు పోస్టుమెట్రిక్ ఉపకార వేతనాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి మల్లేశం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, గడువును మార్చి 31 వరకు పొడిగించినట్లు తెలిపారు. అర్హులైన వారు తెలంగాణ ఈ-పాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కలెక్టరేట్‌లోని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.



ఘనంగా గంధోత్సవం

జేపీ దర్గాలో వైభవంగా ప్రారంభమైన ఉర్సు



గంధం ఊరేగింపులో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మతుల్లా

- హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మతుల్లా
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- ఆకట్టుకున్న గిరిజనుల నృత్యాలు




దర్గా ఆవరణలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, వక్ఫ్‌బోర్డు చైర్మన్

కొత్తూర్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామ శివారులోని హజ్రత్ జహంగీర్‌పీర్ దర్గా ఉర్సు వైభవంగా ప్రారంభమైంది. మొదటి రోజు గురువారం రాత్రి గంధోత్సవాన్ని వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డిలతో కలిసి వారు గంధాన్ని శిరస్సుపై పెట్టుకుని మేళ తాళాలతో ఊరేగింపుగా

మిగతా 7వ పేజీలో...



జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల ఏర్పాటు విషయంలో అన్ని ప్రధాన పార్టీలు హామీ నిచ్చాయి. ఏళ్లు గడుస్తున్నా సాగునీరు అందని పరిస్థితి. నీటి వనరులు లేక సాగుకు రైతులు వర్షం, బోర్లపైనే ఆధారపడాల్సిన పరిస్థితి. ప్రస్తుతం జిల్లాకు చెందిన రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో పాలమూరు ఎత్తిపోతలపై రైతులు గంపెడాశలు పెట్టుకున్నారు.



ఎత్తిపోతలపై గంపెడాశలు!

ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని పాలమూరు ప్రాజెక్టు

జిల్లా నుంచి సీఎం ఉండటంతో చిగురిస్తున్న ఆశలు.. ప్రాజెక్టు పూర్తయితే 3.28 లక్షల ఎకరాలు సాగులోకి

పరిగి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లాలో 8,73,477 ఎకరాల భూములున్నాయి. ఇందులో ఆరు లక్షల ఎకరాల విస్తీర్ణం పంటలకు అనువుగా ఉంది. చెరువుల నుంచి పది శాతం భూములకు సాగునీరు అందాల్సి ఉన్నా ప్రస్తుతం రెండుశాతం భూములకు కూడా నీరందే పరిస్థితి లేదు. చెరువుల్లోకి నీరు చేరినా పంటలు పండే పరిస్థితి లేదు. పూడిక నిండిపోవడం ద్వారా నిండిన రెండు నెలల్లోనే చెరువులు ఎండిపోతున్నాయి. దీంతో వర్షం, బోర్ల ద్వారానే పంటలను సాగు చేస్తున్నారు. జిల్లాలోని 19 మండలాల్లో 70 వేల వ్యవసాయ బోర్లు ఉంటాయి. నీళ్ల పడని బోర్లు దాదాపు మూడు లక్షలకుపైగా ఉంటాయి. జిల్లాలోని పరిగి,తాండూరు, కొడంగల్ ప్రాంత రైతులు ఎక్కువగా బోర్లపైనే

మిగతా 8వ పేజీలో...

సాగునీటిని సాధిస్తాం



పాలమూరు ఎత్తిపోతల పథకం ద్వారా జిల్లాకు సాగునీటిని సాధించి తీరుతాం. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పూర్తిగా విస్మరించింది. చేవెళ్ల-ప్రాణహితను దారి మళ్లించింది. జిలాకు తీవ్ర అన్యాయం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎత్తిపోతల ద్వారా ఏడాదిలోపు జిల్లాకు సాగు నీరు తీసుకువస్తాం.

-డాక్టర్ రామ్మోహన్‌రెడి, ఎమ్మెల్యే పరిగి



రిపోర్టు చేసిన నూతన ఎస్ఐలతో ఎస్పీ నారాయణరెడ్డి

9 మంది ఏఎస్ఐలకు పదోన్నతి

- ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తొమ్మిదిమంది ఏఎస్ఐలు ఎస్ఐలుగా పదోన్నతి పొందినట్లు ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. గురువారం వారు ట్రైనింగ్ పూర్తి చేసుకుని ఎస్పీ కార్యాలయంలో రిపోర్ట్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రమోషన్ పొందిన వారికి అభినందనలు తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రజలకు అన్నివేళల అందుబాటులో ఉండి సేవలందిస్తూ జిల్లాకు పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎంపీ ఈటల, ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్ టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా స్థానిక ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి సూచించారు. గురువారం మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో రూ. 44 కోట్ల నిధులతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను ఆయన ఎంపీ ఈటల రాజేందర్, మల్లారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తుందన్నారు. పథకాల అమలు విషయంలో ప్రజాప్రతినిధులు కలిసి లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు.

నాణ్యమైన వైద్య సేవలందించాలి: ఎంపీ ఈటల

నిరుపేదలకు నాణ్యమైన వైద్యం సేవలు అందించటానికి కృషి చేయాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన ఆసుపత్రి పనితీరుపై పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, శరత్ చంద్రారెడ్డి, వజ్రేష్ యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపికానర్సింహారెడ్డి, ఏఎంసీ చైర్మన్ నర్సింహులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను నిలదీసే ప్రయత్నం

డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించడానికి వచ్చిన ఎమ్మెల్యే మల్లారెడ్డిని ఓ బీజేపీ నాయకుడు నిలదీసే ప్రయత్నం చేయగా బీఆర్ఎస్ నాయకులు అడ్డుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉండి ఆస్పత్రిని అభివృద్ధి పరచ లేక పోయారని నిలదీసే ప్రయత్నం చేశాడు. దాంతో అతన్ని ఆస్పత్రి నుంచి బయటికి పంపించి వేశారు. అనంతరం బీఆర్ఎస్, బీజేపీ నాయకులకు మధ్య వాగ్వాదం జరిగింది. పార్టీ పెద్దల జోక్యంతో వివాదం సద్దుమణిగింది.







అడ్డగోలు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

చేవెళ్ల, జనవరి 16(ఆంధ్రజ్యోతి): అడ్డగోలు హామీలతో కాంగ్రెస్ గద్దెనెక్కి సంవత్సరం గడిచినా రైతు భరోసా, పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేస్తుందని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం చేవెళ్ల మండల కేంద్రంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, జిల్లా యువజన నాయకుడు పట్నం అవినాష్‌రెడ్డి, డీసీసీ చైర్మన్ కృష్ణారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి దేశమోళ్ల అంజనేయులులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో ఉచిత బస్సు తప్ప ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు శ్రీధర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, మాధవరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి

షాబాద్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కొండగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం షాబాద్ మండల కేంద్రంలో నిర్వహించే రైతు ధర్నాకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నారని తెలిపారు. గురువారం షాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్ రెడ్డితో కలిసి రైతు ధర్నా స్థలాన్ని పరిశీలించారు. పార్టీ మండలాధ్యక్షుడు నర్సింగ్‌రావు, నాయకులు వెంకటయ్య రాజేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీరాం రెడ్డి, రమేష్, రాంచంద్రారెడ్డి, అరీఫ్, మక్రమ్‌ఖాన్ పాల్గొన్నారు.

'అభివృద్ధి పేరుతో మోసం చేస్తే ఊరుకోం'



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నాయకుడు జాన్‌వెస్లీ

కందుకూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పేరుతో రైతులను మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై ఉద్యమానికి సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఇప్పటికే అన్నిరకాల రోడ్లు అందుబాటులో ఉన్నా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఫోర్త్‌సిటీ పేరుతో భూములు లాక్కోవడానికి కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఒక్క రోడ్డు వేయడానికి వెయ్యి నాలుగు ఎకరాలను 4725మంది రైతుల నుంచి సేకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. గ్రామసభలు నిర్వహించకుండా అధికారులు కార్యాలయాలకు వచ్చే రైతులకు ఎకరాకు రూ.25 లక్షల నుంచి రూ.90 లక్షల పరిహారం ఇవ్వనున్నట్లు చెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి యాదయ్య, రైతు సంఘం కార్యదర్శి మధుసుదన్‌రెడ్డి, నాయకులు రాంచందర్, సామెల్, కవిత, బాల్‌రాజ్, చందు, కుమార్ పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి లడ్డూ రూ.1.5 లక్షలు



వేలంలో లడ్డూ దక్కించుకున్న భక్తుడు రమేష్ నాయక్

మేడ్చల్ టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రాజబొల్లారం ఘన్‌పూర్ క్షేత్రగిరి వేంకటేశ్వర స్వామి లడ్డును ఓ భక్తుడు రూ.1.5 లక్షలకు దక్కించుకున్నాడు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఘన్‌పూర్ క్షేత్రగిరి వేంకటేశ్వర స్వామి ఆలయ ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి సమర్పించిన లడ్డూకు గురువారం వేలంపాట నిర్వహించారు. రాజబొల్లారం తండాకు చెందిన గన్యానాయక్ వేలంపాడి సొంతం చేసుకున్నాడు.

మహేశ్వరం వైపు ప్రపంచం చూపు

మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి



మహేశ్వరం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో నూతనంగా ఏర్పాటు కాబోతున్న మహానగరం వైపు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ఎదురుచూస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం తుక్కుగూడలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చేందుకు సీఎం సింగాపూర్, దావోస్ పర్యటనకు వెళ్లారన్నారు. బీఆర్ఎస్ పాలనలో అవినీతి తప్ప అభివృద్ధి కనిపించలేదని ఎద్దేవా చేశారు. త్వరలో 330 ఫీట్ల రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఓఆర్ఆర్ టు ట్రిపుల్ ఆర్ వరకు రైతులు నష్టపోకుండా పరిహారంతోపాటు ప్లాట్లు, మహిళలకు సోలార్ ఎనర్జీ ప్లాంట్స్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి కార్పొరేషన్ స్థాయికి మహేశ్వరం, కందుకూరు మండలాలను తీసుకుపోయేందుకు ప్రభుత్వం యోచిస్తున్నదన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి



రాంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్

కీసర, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని మేడ్చల్ నియోజకవర్గం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మాల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. నాగారం మున్సిపల్ పరిధిలోని రాంపల్లిలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.40 కోట్లతో నిర్మించిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అధికారులు విధుల్లో నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. జంట నగరాలకు ఆనుకొని విలీన గ్రామాల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మరిన్ని ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాదయాత్రగా శ్రీశైలానికి మహిళలు



పాదయాత్రగా వెళ్తున్న మహిళలు

తాండూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): తాండూరు నుంచి శ్రీశైలానికి పాదయాత్రగా మహిళా భక్తులు బయలుదేరారు. గురువారం తాండూరు పట్టణం భద్రేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్ర ప్రారంభించారు. శ్రీ ఉమా మహేశ్వరీ సేవా సమితి ఆధ్వర్యంలో కౌన్సిలర్ నీరజాబాల్‌రెడ్డి నేతృత్వంలో సాగిన పాదయాత్రలో పెద్ద ఎత్తున మహిళలు తరలివెళ్లారు కాషాయ చీరలు, పురుషులు తెల్లటి వస్త్రాలు ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పాదయాత్రకు తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అంత్యక్రియల్లో ఎర్రోళ్ల రాఘవేందర్, ముదిరాజ్ సంఘం నాయకులు

కడ్తాల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఓ వృద్ధుడి మృతదేహానికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోళ్ల రాఘవేందర్ ఆధ్వర్యంలో ముదిరాజ్ సంఘం నాయకులు అంతిమయాత్ర నిర్వహించి అంత్యక్రియలు నిర్వహించారు. కడ్తాల మండల కేంద్రంలోని ప్రజా చౌక్‌వద్ద యువజన సంఘాల ఐక్యవేదిక, వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన ప్రజా మరుగు దొడ్ల వద్ద అదనపు గదిలో కొన్నేళ్లుగా వృద్ధుడు పల్గాడం రాములు నివాసముంటున్నాడు. అనారోగ్యంతో బుధవారం మృతి చెందగా గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు కేశని యాదయ్య, శేఖర్, అంజయ్య, జంగయ్య, శ్రీరాములు, చెన్నయ్య, శ్రీకాంత్, వివేకానంద యూత్ అధ్యక్షుడు మాదవులు, కుమార్ గౌడ్, సత్యనారాయణ, బాలయ్య, రాజు, శివకుమార్, మహేశ్, బాలకృష్ణ ఉన్నారు.

అలరించిన ట్రాక్టర్ రివర్స్ పోటీలు



ట్రాక్టర్ రివర్స్ పోటీల విజేతలకు బహుమతి అందిస్తున్న బీసీ కరుణాకర్ రెడ్డి

కేశంపేట, జనవరి 16(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బీసీ కరుణాకర్ రెడ్డి నేతృత్వంలో గురువారం ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఉద్దావత్ లచ్చిరాం ప్రథమ బహుమతి సాధించారు. ఆయనకు బీసీ కరుణాకర్ రెడ్డి రూ. 5 వేలు నగదు బహుమతి అందించారు. ద్వితీయ బహుమతి సాధించిన ఉద్దావత్ రవికి చిట్టిరెడ్డి రామ్‌రెడ్డి రూ.3,000, తృతీయ బహుమతి సాధించిన కేతావత్ వెంకటేష్‌కు చిట్టి రెడ్డి వెంకట్‌రెడ్డి రూ.1,500 అందించారు. ఈ సందర్భంగా డ్రైవర్లను అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భీమయ్య, చిట్టిరెడ్డి నరసింహారెడ్డి, లాలమోని రాఘవేందర్, బీసీ బుచ్చి రెడ్డి, నిరంజన్, ఖాజా, పోగుల నర్సింహులు, ఖేఖర్, మహాలింగం, కృష్ణ, శివయ్య, నరేష్, కుమార్ పాల్గొన్నారు.

20న గ్రంథాలయ కమిటీ ప్రమాణ స్వీకారం



ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను ఆహ్వానిస్తున్న మధన్‌మోహన్‌రెడ్డి

షాద్‌నగర్ అర్బన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ గ్రేడ్-1 గంథ్రాలయ అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారం ఈనెల 20న నిర్వహించనున్నట్లు కమిటీ నూతన అధ్యక్షుడు కొప్పుల మధన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. గ్రంథాలయం ఎదుట ఉదయం 9.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, జిల్లా గ్రంథాలయ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి హాజరవుతారని వెల్లడించారు. ఈ మేరకు అతిథులను కలిసి ఆహ్వానించామని, కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

ఘనంగా గోదా అమ్మవారి నోము



ఘట్‌కేసర్ రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎదులాబాద్‌లోని గోదా సమేత శ్రీమన్నారు రంగనాయకస్వామి ఆలయంలో గోదాదేవి నోమును ఘనంగా నిర్వహించారు. ధనుర్మాస వ్రత ఉత్సవాల్లో భాగంగా కల్యాణం మరుసటి రోజు అమ్మవారికి నోము చేయడం ఆనవాయితీగా వస్తుంది. ఉదయం అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ ఆవరణలోని కల్యాణమండపంలో అమ్మవారిని ప్రత్యేకంగా ఆలంకరించి అభిషేకం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి నోమును వీక్షించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు టీపీ రాజగోపాలచార్యులు, పవనాచార్యులు, అచ్యుతాచార్యులు, శ్రీవాత్సవాచార్యులు, శ్రీపతిచార్యులు, భక్తులు జవ్వాజి లింగంముదిరాజ్, బింగి రాజేందర్‌గౌడ్, ఆనంద్, మేరే సింహం, అల్లం శంకర్, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మోహన్‌రెడ్డి, గుండ్ల అంజనేయులు, మల్లికార్జున్, సురేందర్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



చిగురిస్తున్న ఆశలు

- మొగిలిగిద్ద మండల ఏర్పాటుపై స్థానికుల ఎదురుచూపులు
- 31న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన
- ప్రొఫెసర్ హరగోపాల్ ఆధ్వర్యంలో సీఎంను కలిసిన గ్రామస్తులు

షాద్‌నగర్‌రూరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద మండల కేంద్రం ఏర్పాటుపై గ్రామస్తుల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. 150 ఏళ్ల కింద నవాబులు పోలీస్‌స్టేషన్, పోస్టాఫీసు, పాఠశాలను ఏర్పాటు చేశారు. చరిత్రాత్మకమైన మొగిలిగిద్దను మండల కేంద్రం చేయాలని గ్రామస్తులు ఏళ్లుగా కోరుతున్నారు. మండలం చేయాలని 100 రోజులు నిరాహర దీక్షలు సైతం చేశారు. మొగిలిగిద్దకు ఎంతో ఘనమైన చరిత్ర ఉంది. నాడు నిజాం నవాబులపై తిరుగుబాటు చేసిన తుర్రేబాజ్‌కాన్ కింగ్ కోటీలో నవాబులపై బాంబులు వేసి బెంగుళూరు వెళ్లే క్రమంలో మార్గ మధ్యలో మొగిలిగిద్దలో ఆశ్రయం పొందారు. ఇది తెలుసుకున్న నిజాం రాజు మొగిలిగిద్దకు సైన్యాన్ని పంపించి ఆయనను పట్టుకెళ్లి కింగ్ కోటీలో చంపినట్లు చెప్పుకుంటారు. మొగిలిగిద్దలో తుర్రేబాజ్ ఖాన్ ఆశ్రయం పొందడం నిజాం రాజుకు ఆందోళన కలిగించింది. తమకు వ్యతిరేకంగా అక్కడ కార్యకలాపాలు జరుగుతున్నాయని పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశారు. సమాచారం కోసం పోస్టాఫీసు నెలకొల్పారు.

మండలాల ఏర్పాటుతో...



1983లో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజల వద్దకు ప్రభుత్వం అనే నినాదంతో కొత్తగా ఏర్పాటు చేసిన కొందుర్గు మండలానికి మొగిలిగిద్ద పోలీస్‌స్టేషన్‌ను తరలించారు. దీనిని గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకించారు. అనంతరం పోలీస్ స్టేషన్ భవనాన్ని గ్రంథాలయంగా మార్చి దానికి తుర్రేబాజ్‌ఖాన్ పేరు పెట్టుకున్నారు. భవనం మాత్రం నేటికీ చెక్కు చెదరలేదు. పోస్టాఫీసులో పౌర సేవలు కొనసాగుతున్నాయి.

గతంలో విస్మరించిన బీఆర్ఎస్

బీఆర్ఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలు ఏర్పాటు చేసింది. కానీ, మొగిలిగిద్దను మండలం చేయడం విస్మరించారు. ఇక్కడి పాలకులు గాని ప్రభుత్వం గాని పట్టించుకోలేదు. దీంతో మండలం చేయాలని గ్రామస్తులు వంద రోజులు రిలే నిరాహార దీక్షలు చేశారు. ఎవరూ స్పందించకపోవడంతో ప్రొఫెసర్ హరగోపాల్ గ్రామస్తులకు నచ్చజెప్పి దీక్షలు విరమింపచేశారు.

పాఠశాల.. 150 వసంతాల వేడుక

మొగిలిగిద్ద పాఠశాల 150 వసంతాలు పూర్తి చేసుకుంది. పూర్వ విద్యార్థులు వేడుకలు జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. అందుకు వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ సారి ఘనంగా నిర్వహించుకోవాలని ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

చర్చకు మండల ఏర్పాటు

ప్రొఫెసర్ హర గోపాల్ నేతృత్వంలో గ్రామస్తులు గత శనివారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డిని కలుసుకున్నారు. ఆయన గ్రామానికి వస్తానని మాటిచ్చారు. అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అందుకు కలెక్టర్ నారాయణరెడ్డిని ఆదేశించారు. ఆయనతో జరిగిన చర్చలో మండల ఏర్పాటు అంశం ప్రధానంగా చర్చకు వచ్చినట్లు తెలిపారు. మండల ఏర్పాటుకు సీఎం ఆమోదం తెలిపితే దశాబ్దాల తమ కోరిక నెరవేరుతుందని ఆశగా ఎదురు చూస్తున్నారు.

అప్పట్లోనే 140 గ్రామాల పరిధి..



అప్పట్లో మొగిలిగిద్ద పోలీస్‌స్టేషన్ కింద 140 గ్రామాలు ఉండేవి. అది అప్పట్లో రికార్డు. ప్రజలు ఉద్యమాల వైపు వెళ్లకుండా చదువు వైపు వెళ్లాలని పాఠశాలను ఏర్పాటు చేశారు. నాడు ఆ పాఠశాలలో చదివిన వారు నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నారు. హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి డాక్టర్ బూర్గుల రామకృష్ణారావు, అన్నారం గ్రామానికి చెందిన ఉత్తరప్రదేశ్ మాజీ గవర్నర్ స్వర్గీయ సత్యనారాయణరెడ్డి మొగిలిగిద్ద పాఠశాల విద్యార్థులే.. పౌర హక్కుల నేత ప్రొపెసర్ హరగోపాల్ స్వగ్రామం మొగిలిగిద్దనే. ఆయన చదువుకున్నది ఇక్కడే. దేశ, విదేశాల్లో ఎందరో ఉన్నతంగా స్థిరపడిన వారూ ఉన్నారు.

సీఎం రాకకు ఎదురుచూస్తున్నాం



సీఎం రేవంత్‌రెడ్డి రాక కోసం ఎదురు చూస్తున్నాం. తమ గ్రామాన్ని మండలం చేయాలని కోరుతున్నాం. చేసిన దీక్షలకు ఫలితం దక్కుతుందని భావిస్తున్నాం.

- సిరాజొద్దీన్, పూర్వ విద్యార్థి- మొగిలిగిద్ద

మండలముగా ప్రకటించాలి



సీఎం రేవంత్‌రెడ్డి మొగిలిగిద్దకు వస్తుండడం చాలా సంతోషంగా ఉంది. తమ చిరకాల కోరిక మండలం చేయడం. దానిని ప్రకటించాలని కోరుతున్నాం.

- మర్మల జంగయ్య, మొగిలిగిద్ద

ఘనంగా గంధోత్సవం



గంధం ఊరేగింపులో కిక్కిరిసిన భక్తులు



విద్యుత్ దీపాలంకరణలో దర్గా ముఖద్వారం

(5వ పేజీ తరువాయి)

వెళ్లి దర్గాకు సమర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అంతకుముందు దర్గా ఆవరణలోని సమావేశ హాల్‌లో ముస్లిం పెద్దలు గంధానికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసి ఖవాలీ పలువురిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా దర్గా ముజావర్లు ముఖ్యఅతిథులకు తలపాగా చుట్టి స్వాగతం పలికి, ఆశీర్వచనాలు చేసి గంధంతో పాటు ప్రసాదాలు అందజేశారు. వేలాది మంది భక్తులు తరలి వచ్చి దర్గాలో మొక్కులు తీర్చుకున్నారు. శంషాబాద్ ఏసీపీ శ్రీనివాస్ రావు, కొత్తూర్ ఇన్‌స్పెక్టర్ నర్సింహ్మారావు ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందో బస్తు ఏర్పాటు చేశారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే, వక్ఫ్ బోర్డు చైర్మన్ మాట్లాడుతూ గత పాలకులు దర్గా అభివృద్ధిని విస్మరించారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇక్కడ అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. దర్గాకు వచ్చే భక్తుల కోసం బస్టాండ్, బైపాస్ రోడ్డు పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు ఇన్‌చార్జి తహసీల్దార్ ఆసిఫ్‌ఖాన్, సూపరింటెండెంట్ సత్తార్, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబార్‌ఖాన్, ఆయా పార్టీల నాయకులు ఎం. శివశంకర్‌గౌడ్, ఆగీర్ రవికుమార్ గుప్త, ఖాజు, గొంగళ్ల హరినాథ్ రెడ్డి, ఆగ్గనూరు విశ్వం, బస్వమప్ప, జంగ నర్సింహ్మా, కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, కుమారస్వామి, అంబటి ప్రభాకర్, ఎల్లారం శేఖర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, గంద్రాతి బాల్‌రాజ్‌గౌడ్, మసూద్, ముబారక్‌అలీ, ఇబ్రహీం, కబీర్, అలీం, ఖాలేద్, రషీద్, గోపాల్‌నాయక్, సిరాజ్, రఫీక్, వాజిద్, ఖాజా, సందాని, నసీర్, జబ్బార్ పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం దీపారాధణ కార్యక్రమం నిర్వహిస్తారు.

ఇన్ముల్‌నర్వ నుంచి గంధాన్ని తీసుకొచ్చిన గిరిజనులు, ముజావర్లు

ఉర్సు ఉత్సవాల్లో భాగంగా గంధోత్సవ కార్యక్రమంలో ఇన్ముల్‌నర్వ తండా నుంచి కూడ గిరిజనులు, దర్గా ముజావర్లు గంధాన్ని జేపీ దర్గాకు సమర్పించడం అనవాయితీగా వస్తుంది. గిరిజనులు, ముజావర్లు గంధాన్ని తలపై పెట్టుకుని మేళతాళాలతో నృత్యాలు చేసుకుంటూ ఊరేగింపుగా తరలివచ్చి దర్గాకు సమర్పించారు.


ఎంపీటీసీ స్థానాల ఏర్పాటుకు కసరత్తు

చౌడాపూర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): చౌడాపూర్ మండలంలో కొత్తగా ఎంపీటీసీల స్థానాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. చౌడాపూర్ మండలముగా ఏర్పడి మూడు సంవత్సరాలు పూర్తయింది. ఇటీవల ప్రభుత్వం మండలానికి ఎంపీడీవో కార్యాలయం మంజూరు చేసింది. త్వరలో కార్యాలయం ప్రారంభం కానుంది. మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండల పరిధిలో కొనసాగుతున్న గ్రామాలు సైతం చౌడాపూర్ మండల పరిధిలో విలీనం చేసేందుకు అధికారులు రికార్డులు సేకరిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ముందుగా ఎంపీటీసీలు, జడ్పీటీలకు ఎన్నికలు జరుగుతాయని ప్రచారం జరుగుతుంది. ఈ నేపథ్యంలో కొత్తగా ఎంపీటీసీ స్థానాల ఏర్పాటు అనివార్యం అయ్యింది. ఇప్పటివరకు మండల పరిధిలో ఎంపీటీసీ స్థానాలు కులకచర్ల మండల పరిధిలో కొనసాగుతూ వచ్చాయి. ప్రస్తుతం చౌడాపూర్, మందిపాల్, అడవి వెంకటాపూర్, లింగంపల్లి ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. నవాబుపేట మండలంలోని కొత్తపల్లి, మరికల్, కన్మన్ కాల్వ, మల్కాపూర్ ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. వీటితో పాటు కొత్తగా మరో ఐదు స్థానాలను ఏర్పాటు చేయనున్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాన్ని తనకు అనుకూలమైన రిజర్వేషన్ చేయించుకోవాలని అధికార పార్టీ నేతల ప్రయత్నాలు మొదలయ్యాయి.

పార్టీని బలోపేతం చేయాలి

పరిగి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో గట్టి పోటీని ఇచ్చేందుకు బీజేపీని మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర కార్యనవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావు, ఓబీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వెన్నె ఈశ్వరప్పలు అన్నారు. కొత్తగా నియమితులైన పార్టీ పరిగి పట్టణ అధ్యక్షుడు బాలకిష్టారెడ్డి,పరిగి మండల అధ్యక్షుడు డి.అంజనేయులు, దోమ మండల అధ్యక్షుడు మల్లేశ్, కులకచర్ల మండల అధ్యక్షుడు వెంకటేశ్, చౌడాపూర్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మహ్మదాబాద్ మండల అధ్యక్షుడు నర్సింహులు తదితరులను గురువారం పరిగిలోని ఎస్వీ గార్డెన్‌లో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటయ్యగౌడ్, వేముల పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు నాణ్యమైన విద్యనందించాలి



ఎమ్మెల్యే శంకర్‌తో కలిసి జూనియర్ కళాశాల భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్

ప్రొఫెసర్ హరగోపాల్

షాద్‌నగర్ అర్బన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు పేదలకు నాణ్యమైన విద్యనందిస్తే అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థికంగా ఎదుగుతారని తెలంగాణ పీపుల్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని మొగిలిగిద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాల 150వ వార్షికోత్సవ సన్నాహక సమావేశానికి గురువారం వెళ్తూ షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిశారు. ఎమ్మెల్యే శంకర్ హరగోపాల్‌ను సన్మానించి పాదాభివందనం చేశారు. అనంతరం దాతల సహకారంతో నిర్మిస్తున్న షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ గత ప్రభుత్వాల తప్పిదాలతో ప్రభుత్వ విద్య నిర్వీర్యమై ప్రైవేట్ వైపు వెళ్తున్నారని చెప్పారు. తనతోపాటు డాక్టర్ మర్రి చెన్నారెడ్డి, బూర్గుల రామకృష్ణారావు వంటి మేధావులు మొగిలిగిద్ద ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నారని గుర్తు చేశారు. పేద విద్యార్థులు చదువుతున్న జూనియర్ కళాశాలను అన్ని హంగులతో భవన సముదాయ నిర్మాణానికి ఎమ్మెల్యే పూనుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్, కాంగ్రెస్ నాయకులు అగ్గనూరి విశ్వం, బాల్‌రాజ్‌గౌడ్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, కొంకళ్ల చెన్నయ్య, అగ్గనూరి బస్వం, గడ్డం శ్రీనివాస్‌యాదవ్, అందె మోహన్, ఇబ్రహీం, సయ్యద్ ఖదీర్, ముబార్, మాదవులు పాల్గొన్నారు.

జైపాల్‌రెడ్డి గొప్ప రాజనీతిజ్ఞుడు: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, జనవరి 16(ఆంధ్రజ్యోతి) నీతి, నిజాయితీగా ఉంటూ అత్యున్నత రాజకీయ ప్రమాణాలు పాటించిన గొప్ప రాజనీతిజ్ఞుడు జైపాల్ రెడ్డి అని, ఆయన నెలకొల్పిన ప్రమాణాలను నేటితరం నాయకులు పాటించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. కేంద్ర మాజీ మంత్రి, స్వర్గీయ సూదని జైపాల్ రెడ్డి 83వ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ప్రొఫెసర్ హరగోపాల్ హాజరయ్యారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరి విశ్వం, నాయకులు అగ్గనూరి బస్వం, ఇబ్రహీం, శ్రీనివాస్ యాదవ్, కొమ్ము కృష్ణ, జంగారి రవి, గోవర్ధన్ గౌడ్, ఖదీర్, మాధవులు, జగదీశ్, వాసు, దిలీప్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ హౌసింగ్ డీఈ, ఏఈలుగా బాధ్యతలు స్వీకరణ

తాండూరు రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తాండూరు నియోజకవర్గం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పర్యవేక్షించేందుకు అధికారులు గురువారం తాండూరు మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. హౌసింగ్ కార్పొరేషన్ డీఈగా ఎండీ. ఖలీముద్దీన్, ఏఈగా అబ్దుల్ రహ్మాన్‌లను ప్రభుత్వం నియమించింది. దీంతో వారు తాండూరు మండల పరిషత్ కార్యాలయంలోని విశ్వప్రసాద్‌ను సంప్రదించగా, ఆయన వారికి కార్యాలయాన్ని కేటాయించారు. దీంతో తాండూరు నియోజకవర్గంలోని బషీరాబాద్, యాలాల, పెద్దేముల్, తాండూరు, తాండూరు పట్టణంతోపాటు ఆయా గ్రామాల పరిధిలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. అయితే నియోజకవర్గానికి సంబంధించిన ఇందిరమ్మ ఇళ్ల మోడల్ నిర్మాణానికి తాండూరు మండల పరిషత్ కార్యాలయం పక్కన స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. ఈ స్థలంలో త్వరలోనే తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చేతుల మీదుగా మోడల్ హౌస్‌ను నిర్మించేందుకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.రు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తాండూరు నియోజకవర్గానికి ప్రభుత్వం 3500 ఇళ్లు మంజూరు చేసిందన్నారు. అట్టి పనులను త్వరలోనే ప్రారంభించి పర్యవేక్షిస్తామని చెప్పారు.

సరదాగా కాసేపు..

కాలక్షేపం చేసిన మూడు పార్టీల ముఖ్య నేతలు



ఒకే చోట కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నేతలు

మేడ్చల్ టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఒకరిపై మరొకరు విమర్శల అస్త్రాలు సంధించే మూడు పార్టీల ముఖ్య నేతలు ఒకచోట చేరారు. కాసేపు కబుర్లతో కలక్షేపం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో గురువారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, బీజేపీకి చెందిన మాల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, బీఆర్ఎస్‌కు చెందిన మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్ మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి నర్సింహారెడ్డి ఇంట్లో మధ్యాహ్నం ఏర్పాటు విందులో పాల్గొన్నారు. సరదాగా కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేశారు. చైర్‌పర్సన్ ఇంటికి రావటానికి ముందుగా నిరాకరించిన ఎమ్మెల్యే మల్లారెడ్డిని చైర్‌పర్సన్ భర్త మర్రి నర్సింహారెడ్డి తన ఇంట్లోకి రావాలని ఆహ్వానించడంతో వచ్చి కూర్చున్నారు. అనంతరం అందరు కాసేపు నవ్వుతూ గడిపారు.

- రేషన్‌కార్డులకు అర్హుల ఎంపికపై కసరత్తు
- కుల గణన డాటా ఆధారంగా జాబితాలు
- దరఖాస్తు చేసుకున్నా తమ పేర్లు లేవంటూ లబ్ధిదారుల ఆవేదన
- స్పష్టత లేని ఆదేశాలతో ఆందోళన

క్షేత్ర పరిశీలన షురూ

తాండూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆహార భద్రత కార్డుల(రేషన్) అర్హులను ఎంపిక చేసేందుకు క్షేత్ర పరిశీలన గురువారం ప్రారంభమైంది. అయితే క్షేత్ర పరిశీలనకు వెళ్లిన అధికారులకు చుక్కెదురవుతోంది. తాము కులగణన సర్వేలో సర్వే చేయించుకున్నా మాకు రేషన్‌కార్డులేదు, తమపేర్లు ఎందుకు రాలేదంటూ ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం కులగణన డాటా ఆధారంగా రేషన్ కార్డు లేని వారిగా గుర్తించి అర్హులైన వారిని ఎంపిక చేసినందుకు జాబితాలను మున్సిపాలిటీలకు, మండల పరిషత్ కార్యాలయాలకు పంపించారు. ఈ డేటా ఆధారంగా నియమించిన అధికారులు క్షేత్ర స్థాయిలో వెళ్లి రెండు లక్షల ఆదాయం, ఏడున్నర ఎకరాల లోపు భూములు ఉన్న వారిని అర్హులుగా గుర్తించాలని మార్గదర్శకాలు అనుగుణంగా అర్హులను ఎంపిక చేసేందుకు జాబితాలను తీసుకొని ఇంటింటికి వెళ్లి పరిశీలిస్తున్నారు. అర్హులై ఉండి గతంలో రేషన్ కార్డు లేకుండా ప్రస్తుతం జాబితాలో పేరు లేని వారు ఏం చేయాలన్న విషయంలో స్పష్టత కొరవడింది. తాండూరు సబ్‌డివిజన్‌లో తాండూరు పట్టణం, యాలాల, పెద్దేముల్, తాండూరు, బషీరాబాద్ మండలాల్లో ఈనెల 20 వరకు వెరిఫికేషన్ చేపడుతారు. అర్హుల జాబితాను ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహించి గ్రామ, వార్డు సభల్లో చదివి వినిపించి తుది జాబితాను రూపొందిస్తారు. 25న రేషన్ కార్డుల ప్రింటింగ్ చేపట్టి 26న లబ్ధిదారులకు అందజేస్తారు.

పరిగి: రేషన్‌కార్డుల దరఖాస్తులు, రైతులకు సంబంధించి పంటల సాగుభూముల వివరాలను పకడ్బందీగా సేకరించాలని వికారాబాద్ ఆర్డీవో ఎం.వాసుచంద్ర సూచించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా మండలంలోని నస్కల్, రూప్‌ఖాన్‌పేట్, తదితర గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ కార్యక్రమంలో బీటీ నవీన్‌రెడ్డి, ఏఈవో, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.


తాండూరు: రేషన్‌కార్డు లబ్ధిదారుల ఎంపికలో భాగంగా క్షేత్ర పరిశీలనలో అధికారులు

దుద్యాల: మండలంలోని వివిధ గ్రామాల్లో నూతన రేషన్ కార్డుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇంటింటికీ గురువారం రెవెన్యూ అధికారులు నర్సింహులు, పకీరప్ప, సత్యనారాయణ వెళ్లి వివరాలను నమోదు చేశారు.

కొడంగల్: ఇంటింటి సర్వే ఆధారంగా కొత్త రేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు కొడంగల్ తహసీల్దార్ బీ.విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ కొడంగల్ మండలం, మున్సిపాలిటీలో కొత్త రేషన్ కార్డుల కోసం 1362 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది లబ్ధిదారుల ఇంటికి నేరుగా వెళ్లి సర్వే పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు.

కులకచర్ల: మండలంలోని 32 పంచాయతీల్లో 1088యూనిట్లను అధికారులు సర్వే చేపట్టనున్నారు. తహసీల్దార్ మురళీధర్ పలుగ్రామాలకు వెళ్లి సర్వేను పరిశీలించారు. ప్రజల సమక్షంలో అర్హులైన రేషన్ లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు.

చౌడాపూర్: విఠలాపూర్‌లో గురువారం కొత్త రేషన్ కార్డుల కోసం అధికారులు సర్వే నిర్వహించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను ఇంటింటికి వెళ్లి సేకరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

బషీరాబాద్: బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్ నేతృత్వంలో ఆర్‌ఐ నాగర్జున్‌రెడ్డి, సిబ్బంది గురువారం వాల్యానాయక్‌తండాలో ఇంటింటి సర్వే చేశారు. తుది జాబితాను ప్రభుత్వానికి నివేదిస్తామని రెవెన్యూ అధికారులు వెల్లడించారు. రేషన్‌కార్డుల కోసం మండల వ్యాప్తంగా 1506 దరఖాస్తులు వచ్చాయని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్లు నవీన్, గోవింద్, అంజిలయ్య, రికార్డు అసిస్టెంట్లు బిచ్చప్ప, మున్యప్ప పాల్గొన్నారు.

దోమ: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను రెవెన్యూ శాఖ అధికారులు సర్వే నిర్వహించారు. గురువారం దోమ గ్రామంలో డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులు వివరాలను సేకరించారు.

మోమిన్‌పేట్: మండలంలోని చీమలదరి, ఎన్కెపల్లి, అమ్రాదికుర్దు, అమ్రాదికలాన్, బురుగుపల్లి, సయ్యద్ అలీపూర్ గ్రామాల్లో గురువారం మూడు బృందాలతో కలిసి ఇంటింటికి వెళ్లి రేషన్‌కార్డు లబ్ధిదారుల వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐలు గోవర్దన్, సరిత, జూనియర్ అసిస్టెంట్‌లు మహేశ్, రాజు, రాఘవేందర్ పాల్గొన్నారు.

మర్పల్లి: మండలంలోని బిల్కల్, తుమ్మలపల్లి, పెద్దాపూర్, గుర్రంగట్టు తదితర గ్రామాల్లో రేషన్ కార్డులు, రైతు భరోసా కోసం సర్వే నిర్వహించారు.

మేడ్చల్ జిల్లాలో..

మేడ్చల్ టౌన్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 4వ, వార్డులో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల సర్వేను స్థానిక కౌన్సిలర్ అమరం సరస్వతి గురువారం నిర్వహించారు. ప్రస్తుతం తన వార్డులో 11మంది లబ్ధిదారులక రేషన్‌కార్డులు మంజూరు కాగా వారి వద్ద నుంచి పూర్తి వివరాలు సేకరించి అధికారులకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.


మేడ్చల్ టౌన్: సర్వే నిర్వహిస్తున్న కౌన్సిలర్ అమరం సరస్వతి

శామీర్‌పేట: తూంకుంట మున్సిపల్‌లో ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం రేషన్‌కార్డులకు సంబంధించి కమిషనర్ వెంకటగోపాల్ సిబ్బందితో కలిసి క్షేత్రపరిశీలన ప్రారంభించారు.

క్రైం కార్నర్

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

పరిగి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ప్రమాదం గురువారం రాత్రి గడిసింగాపూర్ దగ్గర జరిగింది. దోమ మండలం కుమ్మరికుంటతండాకు చెందిన సుభాష్‌నాయక్(31) గురువారం రాత్రి పరిగి మండలం గడిసింగాపూర్ దగ్గర రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో సుభాష్‌నాయక్ తల పగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈమేరకు పరిగి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మైనర్లతో పనిచేయిస్తున్న యజమానులపై కేసు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మైనర్లతో పనిచేయిస్తున్న నలుగురు దుకాణం యజమానులపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ పరశురాం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాలకార్మిక వ్యవస్థను రూపుమాపాలని చేపట్టిన ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా గురువారం ఘట్‌కేసర్ పోలీసులు పలుదుకాణాలు, పరిశ్రమల్లో దాడులు నిర్వహించారు. ఘట్‌కేసర్ ఈడబ్ల్యుఎస్ కాలనీలోని రాజ్‌మార్ట్‌లో పనిచేస్తున్న ఓ మైనర్‌ను, కొండాపూర్‌లోని ఇటుకబట్టీల్లో పనిచేస్తున్న బాలుడిని, శివారెడ్డిగూడలోని ఫాల్‌సీలింగ్ దుకాణంలో పనిచేస్తున్న బాలుడిని, ఎన్ఎఫ్‌సీనగర్‌లో సాగర్ అనే మేస్త్రీ వద్ద పనిచేస్తున్న బాలకార్మికున్ని పోలీసులు అదుపులోకి తీసుకుని హోంకు పంపించారు. అనంతరం దుకాణం యజమానులు, మేస్త్రీపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్‌లో ఒకరు

పోచారం ఐటీ కారిడార్ పోలీసుస్టేషన్ పరిధిలోని అన్నోజిగూడ ఎన్టీపీసీ చౌరస్తా వద్ద స్టీల్ దుకాణంలో పనిచేస్తున్న మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకోని హోంకు తరలించి, యజమానిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాజువర్మ తెలిపారు.

బాల్య వివాహం చేసిన వారిపై ఫిర్యాదు

తాండూరు రూరల్, జనవరి 16, (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహం చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు అందింది. మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన బాలిక(15) స్థానికంగా 9వ తరగతి చదువుతూ మానేసింది. చదువు మానేసిన బాలికను కడప జిల్లా పులివెందుల మండలం అమ్మకాపల్లికి చెందిన సాయికుమార్(26)తో 24 అక్టోబరు 2024లో కుటుంబీకులు పులివెందులలోనే బాల్యవివాహం జరిపారు. విషయం తెలుసుకున్న మల్కాపూర్ అంగన్‌వాడీ టీచర్ మన్‌సాన్‌పల్లి ఆశమ్మ, చైల్డ్‌లైన్ కమిటీ ఆదేశాల మేరకు బాల్య వివాహం జరిగిందని తెలుసుకుంది. ఇట్టి విషయాన్ని స్మైల్ ఆపరేషన్ టీం సభ్యులు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి, నరేష్ కుమార్, చైల్డ్‌లైన్ చంద్రప్పతో కలిసి బాలిక ఇంటికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. ఈమేరకు వివాహ ఫొటోలు సేకరించి తగు చర్యలు తీసుకోవాలని కరన్‌కోట్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

వృద్ధురాలిపై దాడికి పాల్పడిన మనువడిపై కేసు

కులకచర్ల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలిపై దాడికి పాల్పడిన మనువడిపై కులకచర్ల పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. మండలంలోని బిందెం గడ్డ తండాకు చెందిన కోటమ్మ(90) కుమారుడు, కోడలు మృతిచెందారు. వారికి నలుగురు కుమారులు హరిచందర్, రాజు, నాను, లక్ష్మణ్ ఉన్నారు. లక్ష్మణ్ ఇంటి దగ్గరే ఉంటున్నాడు. తరచూ నానమ్మ కోటమ్మతో గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో గత సోమవారం గొడవపడి కోటమ్మపై దాడిచేశాడు. దీంతో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఆమె పెద్ద మనువడు హరిచందర్ ఫిర్యాదు మేరకు గురువారం లక్ష్మణ్‌పై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

సమాజ శ్రేయస్సే పోలీసుల లక్ష్యం


ఇంద్రారెడ్డిని సన్మానిస్తున్న సీఐ పరశురాం, డీఐ, ఎస్ఐలు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సమాజ శ్రేయస్సే పోలీసుల లక్ష్యమని ఘట్‌కేసర్ సీఐ పరశురాం తెలిపారు. ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐలు ఇంద్రారెడ్డి, మహేందర్‌లు ఎస్ఐలుగా పదోన్నతి పొంది శిక్షణ పూర్తిచేసుకొని పోలీసుస్టేషన్‌కు వచ్చిన సందర్భంగా సీఐ, డీఐలు వారిని శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఎస్ఐ శిక్షణ సమయంలో ఇంద్రారెడ్డి ఉత్తమ అవుట్‌డోర్, ఉత్తమ అల్‌రౌండర్, ఉత్తమ ఫైరర్‌గా నిలిచి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు ప్రభాకర్ రెడ్డి, నర్సింహా, శేఖర్, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణను వినియోగించుకోవాలి

కొడంగల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అనధికార లే అవుట్‌లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారి స్థలాల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషన్ బలరాంనాయక్ తెలిపారు. గత ప్రభుత్వ హయంలో ఎల్ఆర్ఎస్ కోసం రుసుము చెల్లించిన వారికే వర్తిస్తుందని తెలిపారు. ఏవైనా సందేహాలుంటే మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

క్రీడలతో స్నేహబంధాలు పెంపొందుతాయి

పరిగి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): క్రీడా పోటీలు స్నేహసంబంధాలను పెంపొందుతాయని డీసీసీ కార్యదర్శి కొమిరె రాంచంద్రయ్య అన్నారు. మండలంలోని బసిరెడ్డిపల్లిలో అండర్-16 క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. అనంతరం విన్నర్ యువరాజ్ టీంకు రూ.5వేలు, రన్నర్ వర్దన్ టీంకు రూ.2500ల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూర్య, నాయకులు గోవర్ధన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పసుపు బోర్డు ఏర్పాటుపై హర్షం

మర్పల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటుతో రైతులకు మేలు జరగనుందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేశ్ యాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ నాయకులతో కలిసి గురువారం ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. త్వరలోనే నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటుకు అనుమతి ఇవ్వడంతో వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మెదక్ తదితర జిల్లాల రైతులకు మేలు జరగనుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి మహేశ్వరి, నాయకులు లక్ష్మణ్, రాజేశ్, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుభాష్, మధుకర్, రవీందర్‌రెడ్డి, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై చర్చ

తాండూరు రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర కార్మిక విభాగం డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ సునీల్ సాహు అధ్యక్షతన సీసీ యజమాని పాల్‌ను కలిసి సమస్యలు వివరించినట్లు యూనియన్ కార్యదర్శి శరణప్ప గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైల్వే కాంట్రాక్ట్ కార్మికుల సూపర్‌వైజర్ బాలరాజు, కార్మికులు దస్తప్ప, ఎల్లప్ప సమక్షంలో కార్మికుల సమస్యలపై ఐదు గంటలపాటు చర్చించామన్నారు. రెండు సంవత్సరాల బోనస్, రెండు సంవత్సరాల వీడియో అరియర్స్, మొత్తం కలిపి 15లక్షల వరకు రైల్వే కార్మికులకు యూనియన్, చట్టపరంగా రావాల్సిన పేమెంట్లను ఇప్పించినట్లు తెలిపారు. కార్మికులంతా బాధ్యతగా ఉండి పనిచేసుకోవాలని సూచించారు.

పీఠం ఎవరికో?

(5వ పేజీ తరువాయి)

ప్రకారం పాత వారికి ప్రాధాన్యత ఇస్తారని ప్రచారం జరుగుతున్న క్రమంలో కొత్తగా వచ్చిన నేతలు సైతం తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నట్లు తెలుస్తోంది.

క్షేత్రస్థాయిలో పటిష్ఠమవుతున్న బీజేపీ

బీఆర్ఎస్ పార్టీ వెనుకబడటం, బీజేపీ చేవెళ్ల స్థానాన్ని గెలుచుకోవడంతో వికారాబాద్ జిల్లాలో బీజేపీ క్షేత్రస్థాయిలో రోజురోజుకు బలపడుతూ వస్తోంది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ మెజార్టీ స్థానాలు గెలిచే అవకాశాలు ఉండడంతో నాయకులు సైతం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అధ్యక్ష పదవిని దక్కించుకోవడం కోసం పోటీ పడుతున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఉండి స్థానిక సంస్థల్లో సత్తా చాటిన వారికి భవిష్యత్తులో మంచి అవకాశాలు వస్తాయని ఆశిస్తున్నారు. అయితే జిల్లా వ్యాప్తంగా పార్టీని నడిపించే నాయకులకు ముందుగా సమయం కేటాయించడంతో పాటు కొంత ఆర్థిక పరిస్థితులు బాగుండి ఖర్చు చేసుకునే స్థోమత ఉంటేనే బాగుంటుందని పార్టీ పెద్దలు సైతం ఆలోచిస్తున్నట్లుగా తెలుస్తోంది. గతంతో పోలిస్తే ప్రస్తుతం బీజేపీ కొత్త పాత తరం నాయకులతో పార్టీని ముందుకు నడిపే ఆలోచనతోనే ముందుకు వెళుతున్నట్లుగా తెలుస్తోంది.

అక్రమ కటౌట్ల తొలగింపు

శామీర్‌పేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అలియాబాద్ చౌరస్తాలో గల రాజీవ్‌రహదారిలో గురువారం ట్రాఫిక్ పోలీసులు రోడ్డుకు అడ్డంగా ఉన్న కటౌట్లను తొలగించారు. అలియాబాద్ చౌరస్తాలో కొందరు అక్రమార్కులు రోడ్డుకు అడ్డంగా, ప్రయాణికుల వాహనాలకు ఇబ్బంది ఉండే విధంగా కటౌట్లను ఏర్పాటు చేయగా ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు వాటిని తొలగించారు.

బస్సుల భద్రతకు సీసీ కెమెరాల ఏర్పాటు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల భద్రతకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తెలిపారు. ప్రతాప్‌సింగారంలో నైట్‌హాల్ట్ చేసే బస్సుల్లో ఇటీవల పలుమార్లు డీజిల్ చోరీకి గురికావడంతో గురువారం గ్రామంలోని ప్రధానచౌరస్తా వద్ద సీసీకెమెరాల ఏర్పాటుకు ఆయన రూ.50వేల నగదును పోలీసులు, ఆర్టీసీ అధికారులకు అందజేశారు.

శ్మశానవాటికల అభివృద్ధికి చర్యలు


శ్మశానవాటికను చదును చేయిస్తున్న కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్, జనవరి 16: మున్సిపాలిటీ పరిధిలోని శ్మశాన వాటికల అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. పోచారంలోని శ్మశానవాటికను గురువారం ఆయన తనిఖీ చేశారు. ముళ్లపొదలతో నిండగా వెంటనే ఎక్స్‌కావేటర్, డోజర్‌ను ఏర్పాటు చేసి ముళ్లపొదలను తొలగించి చెత్తాచెదారాన్ని శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బద్దం జగన్‌మోహన్‌రెడ్డి, అకిటి బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వాహన పత్రాలు తప్పనిసరి


వాహనాలను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ వెంకటేశం

వికారాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపే సమయంలో ప్రతీఒక్కరు వాహనపత్రాలు కలిగి ఉండాలని వికారాబాద్ ట్రాఫిక్ ఎస్ఐ వెంకటేశం అన్నారు. వికారాబాద్ ఎన్టీఆర్ చౌరస్తాలో గురువారం వాహనాలను సిబ్బందితో కలిసి తనిఖీ చేసి పత్రాలు సరిగ్గా లేని వాహనాలకు జరిమానాలు విధించారు.

దుద్యాల ఇన్‌చార్జి వ్యవసాయాధికారిగా హిమబిందు



దుద్యాల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): దుద్యాల మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారిగా హిమబిందు ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వ్యవసాయ శాఖ పరంగా వారి సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు.

వ్యవసాయేతర భూములను గుర్తించాలి


తాండూరు రూరల్: మల్కాపూర్‌లో వ్యవసాయేతర భూములను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

తాండూరు రూరల్, జనవరి 16, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతు భరోసా అందించేందుకు వ్యవసాయేతర భూములను గుర్తించాలని తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ ఆదేశించారు. మల్కాపూర్‌లో జరుగుతున్న సర్వేను గురువారం పరిశీలించారు. తాండూరు మండలంలో ఐదు బృందాలు ఏర్పాటు చేసి సర్వే నిర్వహిస్తున్నారు. మండల పరిధిలోని సంగెంకలాన్, కోటబాస్పల్లి, మల్కాపూర్, కరన్‌కోట్, ఓగీపూర్ తదితర గ్రామాల్లో నాపరాతి గని భూములు ఉన్నాయని, వాటిపై సమగ్ర వివరాలు సేకరించాలని ఆదేశించారు. ఇట్టి సర్వే ఈనెల 20నాటికి పూర్తి చేసి సమగ్ర వివరాలు అందించాలన్నారు. ఆయన వెంట తాండూరు తహసీల్దార్ సింగ్, వ్యవసాయాధికారి కొమరయ్య ఉన్నారు.

కోట్‌పల్లి: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో వ్యవసాయేతర భూములను గుర్తించి నిర్ధారించనున్నట్లు కోట్‌పల్లి తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని రాంపూర్‌లో గురువారం వ్యవసాయ అధికారి కరుణాకర్ రెడ్డి, సిబ్బందితో కలిసి పరిశీలించామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో డానియల్, ఆర్‌ఐ భాగ్యలక్ష్మి ఉన్నారు.

మోమిన్‌పేట్: ఎన్కెపల్లి, అమ్రాదికుర్దు, అమ్రాదికలాన్, బురుగుపల్లి, సయ్యద్ అలీపూర్ గ్రామాల్లో అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి రైతు భరోసా కోసం వ్యవసాయ సాగు భూములు, వ్యవసాయేతర భూములను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మనోహరచక్రవర్తి, భూపతి జయశంకర్ పాల్గొన్నారు.

కొడంగల్: తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో తహసీల్దార్ బి.విజయ్‌కుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. సాగులో ఉన్న భూములకు మాత్రమే రైతు భరోసా అందించేందుకు వ్యవసాయేతర భూములను గుర్తిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏడీఏ శంకర్‌రాథోడ్, ఏవో పూజ పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: మండల కేంద్రంలో పర్గి రోడ్డులో సమిపంలో వ్యవసాయ భూములుగా ధరణి పోర్టల్‌లో నమోదై వ్యవసాయానికి యోగ్యంకాని భూములను రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సర్వే నిర్వహించారు. తహసీల్దార్ విజయ్‌కుమార్, ఏడీఏ శంకర్ రాథోడ్, పూజ, ఏఈఓ రాజు తదితరులు పాల్గొన్నారు.

యాలాల: కోకట్, రసూల్‌పూర్, అగ్గనూరు, యాలాల పరిసర ప్రాంతాల్లో గల భూములను యాలాల తహసీల్దార్ అంజయ్య గురువారం సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ శరణ్, అధికారులు పాల్గొన్నారు.

పరిగి: మండలంలో వ్యవసాయేతర భూములను గుర్తించడానికి గురువారం తహసీల్దార్ ఎం.ఆనంద్‌రావు అధికారులను ఐదు బృందాలుగా ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో రజిత, డిప్యూటీ తహసీల్దార్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బషీరాబాద్: మండలంలోని క్యాద్గీరా శివారులోని భూములను సీనియర్ అసిస్టెంట్ వెంకటేశంతో కలిసి తహసీల్దార్ వై.వెంకటేష్ కలియతిరిగి వ్యవసాయేతర భూములను గుర్తించారు.

ధారూరు: అధికారుల బృందం ధారూరు శివారులోని ఓ వ్యవసాయ పొలంలో నిర్మించిన రైస్ మిల్లును తహసీల్దార్ సాజిదా బేగం, వ్యవసాయ అధికారి సూర్యప్రకాష్, ఏఈవో సంజూ రాథోడ్‌లు పరిశీలించారు. కాగా నాలా, రాళ్ల,రప్పలు, పాంహౌస్‌లు, ఇళ్లు, వెంచర్లు ఉన్న భూములను సాగుకు యోగ్యం కాని భూములుగా గుర్తించి రైతు భరోసాకు అనర్హులుగా పరిగణిస్తామని అధికారులు తెలిపారు.

దోమ: తిమ్మాయిపల్లిలో రైతు భరోసా కోసం గురువారం తహసీల్దార్ పురుషోత్తం, ఏవో ప్రభాకర్‌రావు, ఆర్‌ఐ సుదర్శన్ తదితరులు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా సాగుకు యోగ్యం కాని వ్యవసాయేతర భూములను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు తెలిపారు.

దుద్యాల: సాగుకు యోగ్యత లేని, వ్యవసాయానికి పనికి రాని భూములను గుర్తించేందుకు తహసీల్దార్ కిషన్‌నాయక్, ఏవో హిమబిందుతో కలిసి పర్యటించారు. అంతకు ముందు తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వీరేశ్ బాబు, ఆర్‌ఐ నవీన్, ఏఈవోలు భావన, జ్యోతి పాల్గొన్నారు.


కొడంగల్: సర్వే నిర్వహిస్తున్న అధికారులు

ఎత్తిపోతలపై గంపెడాశలు!

(5వ పేజీ తరువాయి)

ఆధారపడి సాగు చేస్తున్నారు. బోర్ల ఆధారంగా జిల్లాలో దాదాపుగా లక్ష ఎకరాల్లో పంటలు పండిస్తున్నారు. దీంతో యాసంగిలో 80 శాతం భూములు బీడుగానే దర్శనమిస్తున్నాయి.

జిల్లాకు సాగునీరు తీసుకోస్తే 3.28 లక్షల ఎకరాల భూమి సాగులోకి రానుంది. తెలంగాణ రిటైర్డు ఇంజనీర్ల ఫోరం ప్రతిపాదించిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టును నిర్మిస్తే జిల్లా మరో ఉభయ గోదావరిలా కానుంది. ఈ ప్రాజెక్టు ద్వారా పాలమూరు, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలోని 58 మండలాల్లోలోని పది లక్షల ఎకరాలకు సాగునీరు అందించే విధంగా డిజైన్ చేశారు. వికారాబాద్ జిల్లాలోని 18 మండలాలకు 3.28 లక్షల ఎకరాల భూమికి సాగునీరు అందనుంది. ఈ ప్రాజెక్టు కూడా సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి ఉన్నప్పటీ నుంచి ప్రతిపాదనలు కొనసాగుతూనే ఉన్నాయి. కానీ పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. ప్రస్తుతం జిల్లా నుంచి రేవంత్‌రెడ్డి సీఎం కావడం, స్పీకర్‌గా ప్రసాద్ కుమార్ ఉండటంతో మళ్లీ రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. పరిగి ప్రాంతానికి సాగునీరు అందించేందుకు అంతారం దగ్గర 16 టీఎంసీలతో, కేపీ లక్ష్మీదేవిపల్లి దగ్గర 10 టీఎంసీల కెపాసిటీతో రిజర్వాయర్లు నిర్మించాలని ప్రతిపాదించారు. ఆ తర్వాత అంతారం ప్రాజెక్టును తొలగించారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను తగ్గించారు. జిల్లాలోని నాలుగు నియోజకర్గాల నుంచి ఎమ్మెల్యేలు అధికారం పార్టీకి చెందినవారే కావడంతో ఈ ప్రాజెక్టు ఏర్పాటు విషయంలో గట్టి డిమాండ్ వినిపిస్తోంది.

ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచుతాం



బీఆర్ఎస్ హయాంలో పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు విషయంలో ఎంతో ప్రగతిని సాధించాం. ఉద్దండాపూర్ నుంచి నవాబ్‌పేట్ వరకు పనులు జరిగాయి. కొంతకాలం పనులు జరిగితే పరిగికి సాగు నీరు వచ్చేది. అంతలోనే ప్రభుత్వం మారింది. మారినా బీఆర్ఎస్ రైతుల పక్షాన పోరాటం చేస్తుంది. పాలమూరు ఎత్తిపోతల ద్వారా సాగునీరు సాధించేలా ప్రభుత్వంపై పోరాటం చేస్తాం.

-కె.మహేశ్‌రెడ్డి, పరిగి మాజీ ఎమ్మెల్యే

సంక్షిప్తంగా..

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

నవాబుపేట: ఎల్లకొండ గ్రామానికి చెందిన పూలగారి జగదీశ్‌రెడ్డి (39) గుండె పోటుతో బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య గురువారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పచ్ వెంకట్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ మానస, ప్రకాశ్ ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

బొంరాస్‌పేట్: క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక ధారుఢ్యం కలుగుతుందని వివిధ పార్టీల నాయకులు అన్నారు. మండల కేంద్రంలో క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం ప్రారంభించారు. టోర్నమెంట్‌లో వివిధ గ్రామాలకు చెందిన 12 జట్లు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగదీశ్, జనార్ధన్, శేఖర్ పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

వికారాబాద్: పట్టణంలోని తత్వమసి శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రతి బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెల చివరి బుధవారం అయ్యప్ప పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 6:30గంటలకు పడిపూజ ఉంటుందన్నారు.

నేటి నుంచి ఊరడమ్మ జాతర

మర్పల్లి: మండలంలోని బూచన్‌పల్లి గ్రామంలో శుక్రవారం నుంచి ఊరడమ్మ జాతర ప్రారంభం కానున్నట్లు గ్రామ నాయకులు ఉప్పరి రవీందర్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శుక్ర, శనివారాల్లో గ్రామ దేవతలకు బోనాలతో ఊరేగింపు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

విద్యుత్ అంతరాయం

మేడ్చల్ టౌన్/శామీర్‌పేట్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ అపరెల్ పార్క్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో చేపడుతున్న మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు పేర్కొన్నారు. అదేవిధంగా శామీర్‌పేట మండల ఉప్పరిపల్లి, కంట్రిహోమ్స్, ఓఆర్ఆర్ గార్డెన్స్ ఏరియా, వాసవి వెంచర్, లియోనియారిసార్ట్స్ ఏరియా పరిధిల్లో శుక్రవారం(నేడు) ఉదయం 10.30 నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని శామీర్‌పేట విద్యుత్ ఏఈ రాఘవేందర్‌రావు తెలిపారు. గురువారం ఆయన మీడియాకు వెల్లడించారు. ఆ ప్రాంతాల్లో విద్యుత్ మరమ్మతులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

బీసీ మేధావుల సదస్సుకు తరలిరావాలి

కొడంగల్: జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా ఈ నెల 17న హైదరాబాద్‌లోని కాచిగూడలో జరిగే బీసీ మేధావుల సదస్సుకు తరలిరావాలని బీసీ సంక్షేమ సంఘం తాలూకా అధ్యక్షుడు మన్నె బస్వరాజ్‌యాదవ్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్‌లను అమలు చేయాలన్నారు. కొడంగల్ నియోజకవర్గంలోని నాయకులు తరలిరావాలని కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

శామీర్‌పేట: శామీర్‌పేట మండల హకీంపేటలోని ఆర్టీసీ బస్ డిపోలో ఈనెల 17న శుక్రవారం(నేడు) మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఆర్టీసీ సమస్యలపై డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎం భవభూతి తెలిపారు. గురువారం ఆయన మీడియాకు వెల్లడించారు.

సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలి

పరిగి: సంగారెడ్డి పట్టణంలో ఈనెల 25-28 వరకు నాలుగు రోజులపాటు జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య కోరారు. ఈ సభలకు సంబంధించి వాల్‌పోస్టర్లను గురువారం పరిగిలో ఆవిష్కరించారుబ